
# ప్రేమించిన మానవుడు

రామచంద్రమూర్తి ఆ వూళ్ళో కారు దిగే సరికి వెళ్ళిపోయిందని చెప్పారు వాళ్ళు. రామచంద్రమూర్తి నడిగా నిరుత్సాహపడ్డట్లయింది. గబగబా కారు దిగి కొనుక్కున్నాడు. అయినా ఆశ తీరక అలానే నడిచాడు. కారు స్టాండు వేపు నడిచాడు. ఆ తోవనే వున్న కారుస్టాండులో కనుక్కుంటే ఆ కారు వెళ్ళిపోయిం దని ఎవర్నో అడిగాడు. ఆ వూరుకి మరో కారు లేదని తెలిసింది. రామచంద్రమూర్తికి ముందుపూర్వంత మైంది. సాయంకాలమైనంత వరకు ప్రయత్నించి పిండేస్తూ కొంటూ అలానే దిగులుపడి చూస్తూ వుండిపొయ్యాడు.



లైట్లు వెలిగినయ్. ఎదురుగా కాఫీ హోటలు పెంట్ అంటున్న గోడమీద సినిమా పోస్టరు కనబడు తున్నది. ఎవరో నృత్యం చేస్తున్న సుందరి, ఆ గోడ మీద అవయవాల సొంపులు ప్రదర్శిస్తోంది.

సినిమాకు వెళదామా అనుకున్నాడు.

ఎవరైనా స్నేహితులు కనబడతారేమోనని ఒక వంక భయమూ, ఒకవంక ఆశా పీడించసాగినయ్. ఇంతలో వేరుశనక్కాయలు అమ్ముకొనే కుర్రవాడు వచ్చి, కాయలు కొలిచి చేతిలో పొయ్యబోయినాడు. వాణ్ణి చూచి లెంపకాయ కొడదామా అన్నంత కోపం వచ్చింది మూర్తికి.

"కాయలు కావాలా?" అని అడిగాడు వాడు. కసురుకున్న తరువాత వాడు వెళ్ళిపొయ్యాడు.

## "మంజుశ్రీ"

ఓ కప్పు కాఫీయైనా తాగుదామని హోటల్లోకి పోయి కూర్చున్నాడు. అగరువత్తుల పొగ చుట్టు కొంది. హోటలంతా కోలాహలంగా వుంది. సెర్వరు నాలుగు సార్లు తొప్పగా చెప్పగా కాఫీ తెచ్చాడు. మూర్తి ఈలోపున పదిసార్లు విసుక్కున్నాడు. జీవితం చిత్రమైనది. అంతమంది మనుష్యులను చూసి అతననుకున్నాడు. ఇంతమందికి ఎంత తొందర. ప్రపంచ పాలన అంతా తమ భుజస్కంధాల మీదనే వున్నట్లూ, ఒక్కనిమిషం తాము విశ్రాంతి తీసుకుంటే, అంతా తారుమారు జరిగేట్లూ పరుగు లెత్తుతారు. ఒక్కొక్క మనిషిని చూస్తే అకారణంగా అసహ్యం కలుగుతుంది; ఒక్కొక్కరిని చూస్తే ఏవిటో ఆత్మీయత కలుగుతుంది. నానా రకాల మనుష్యులను చూసి మూర్తి ఆశ్చర్యపోయినాడు.

కాఫీ తాగి బయటకొచ్చేసరికి బాగా చీకటిపడింది. అంత పెద్ద వూరు కాదు; చిన్నదీ కాదు. యంత్ర యుగంలో మానవుడు అమర్చుకున్న సామాన్య సదుపాయాలన్నీ వున్నాయి అక్కడ. ఎలక్ట్రిసిటీ, సినిమాహాళ్ళు, పార్కు—ఇత్యాదులన్నమాట.

కారుస్టాండు వేపు నడచి ప్రొద్దుటే కారు ఎన్నింటికి బయలుదేరుతుందో కనుక్కోవాలనుకున్నాడు; శ్రమపడి తెలుసుకున్నాడు.

మొదటి కారు ప్రొద్దున ఏడు గంటలకు గాని బయలుదేరదట.

అప్పటిదాకా ఎలా గడపాలి భగవంతుడా? అని ప్రశ్న. అతడికి తోచలేదు. ముందు భోజనం చూసుకోవాలి. తరువాత పడక.

రేడియోలో వార్తలు వినబడుతున్నాయి. శిఖరాగ్ర సమావేశాలు, యుద్ధ భయం, అశాంతి, ప్రారంభోత్సవం, ప్రమాదాలు, రెండు వేల సంవత్సరాలనాటి విశేషాలు....ఒకటే కాకిగోల. మూర్తి విసుక్కున్నాడు.

హఠాత్తుగా ఓ దారిన పోయే దానయ్యను నిలిపి "భోజనం ఏ హోటల్లో బావుంటుంది?" అని ప్రశ్నించాడు. ఆ దానయ్య మొట్టమొదట మీదేవూరని అడిగి, ఆర్తత్రాణపరాయణుడు వలె ఓ బుట్టెడు సలహాలు నెత్తిన కుమ్మరించాడు. ఇంకాస్త మరి విసుక్కుని మూర్తి హోటలు కోసం వెదక సాగించాడు.

చలి అప్పుడే ప్రారంభమైంది; మంచుకూడా పడుతోంది అప్పుడే. భోజనం చేసి బయటికొచ్చి సిగరెట్టు కాల్చుకొని మూర్తి కాసేపలానే నిల్చుండిపోయ్యాడు. నవమి వెన్నెల. బజార్లు కళకళలాడుతున్నాయి. బజార్లవెంట అలసిపోయేదాకా తిరగటానికి అతడు ఒప్పుకోలేదు. మంచులో తిరిగితే కళ్లు ఎర్రబడి, తప్పక జ్వరం వస్తుంది. పడక చూచుకోవాలి ముందు. ఊళ్లో ఎవరైనా తెలిసినవాళ్లుంటే బాగుండుననిపించింది మనసుకి. మళ్లీ ఇంతలోనే ఉదాసీనత ప్రవేశించి విచలితుణ్ణి చేసింది.

వీధిలో పోతుంటే పెద్ద ఆలయం కన్పించింది. గోపురంవేపు తలెత్తి చూచేసరికి కళ్లుతిరిగిపోయినయ్. చుక్కలు తలపూలుగా...అన్నట్లు వుంది ఆ గోపురం. మూర్తి ముగ్ధుడైపొయ్యాడు. అప్పటికి పదిగంటలైంది.

ఆలయంలో చడీ చప్పుడూ లేదు.

రెండు లైట్లుమాత్రం వెలుగుతున్నాయి.

ద్వారం దాటుతూంటే పడుకోటానికి చోటు తీసుకుంటున్న మనుష్యులు కనుపించారు.

మూర్తికి ప్రాణం లేచివచ్చినట్లయింది.

వాళ్లని అడిగాడు. "ఇక్కడ ఈ రాత్రికి పడుకోవచ్చునా?" అని.

వాళ్లు తెల్లబోయి "ఏ వూరు?" అని అడిగారు.

మూర్తి చెప్పాడు.

వాళ్లు అతడిని కూచోమని "హాయిగా పడుకోవచ్చు" అని చెప్పారు.

"లోపలికి వెళ్లండి. కుడివైపు సత్రం ఖాళీగా లేదు కాని, వేపచెట్టు ముందున్న మంటపంలో ఇతర వూళ్లనుంచి వచ్చిన మీబోటి వాళ్లంతా విశ్రమించవచ్చు. ఇంకో నెలరోజులలో యిక్కడ పెద్ద ఉత్సవాలు జరుగుతాయి. యాత్రికులకు వసతికై ఏర్పాట్లుచేసే ఆఫీసరుగారు లోపల వుంటారు. ఆయన మీకు సౌకర్యం చేస్తారు. అది ఆయన విధి. అలా ఆయన చేస్తారు. మీకు కనీసం చోటైనా చూపిస్తారు. " అని నవ్వి చెప్పారు.

మనుష్యుల మీద పూర్తిగా విశ్వాసం వదులుకోని మూర్తి వాళ్లను లోపలనే ప్రేమించి, ముందుకి సాగాడు. ప్రేమ పుట్టుకకీ, ఈర్ష్య, ద్వేషాలు పుట్టుకకీ స్వార్థమే ప్రాతిపదిక. తన మేలు, తన సౌఖ్యం చూసి తన గొప్పతనాన్ని ఒప్పుకొని, తనకు సౌకర్యం చేస్తే, తనతో తియ్యగా, గౌరవంగా, మర్యాదగా మాటాడితే అటువంటి మనుష్యులను మానవుడు ప్రేమిస్తాడు. లేకుంటే విసుక్కుంటాడు. ద్వేషపడుతాడు. కోపగించుకొంటాడు. మానవత్వం లేదని యీసడిస్తాడు. ఇంకా ఏమేమో అనుకుంటాడు. అంటాడు.

మూర్తి లోపలికి అడుగు పెట్టాడు.

గేటువేసి గొళ్లెంకి గొలుసు చుట్టారు.

యాత్రికులకై ఏర్పాటు గావించబడ్డ కుంటసానికి గొలుసు లెందుకు అని విసుక్కున్నాడు. ఆ గొలుసుని ఓపికగా విప్పుతీశాడు. గేటు చప్పుడు కాకుండా నెట్టి లోన ప్రవేశించాడు.

ఎవరో ఇద్దరు ముగ్గురు బాటసారులు క్రింద బండలమీద పడుకుని వున్నారు. మూర్తికి ఏం చెయ్యటానికీ తోచలేదు. ఓ వైపు నుంచి ఎవరో గురక పెట్టటం వినపడుతోంది. ఎవరిని లేపి అడగాలో అతడికి తెలియలేదు. కాసేపు అలానే నిలబడి చిన్నగా దగ్గాడు. కాని ఎవరూ పట్టించుకో లేదు.

అక్కడేవో మంచం, దానికి దోమతెర వుంది. చప్పుడు కాకుండా ఆ దోమతెర మంచాన్ని చూశాడు మూర్తి. ఎవరో బాటసారి మూలిగి, "ఎవరు?" అన్నాడు.

మూర్తి కొంత ధైర్యం చేసుకుని, "ఇక్కడ ఎక్కడ పడుకోవాలి?" అని అడిగాడు.

ఈసారి ఆ దోమ తెరలోంచి కోమలమైన కంఠం వినిపించింది; "ఏ మూలో ఓ మూల పడుకోండి" అని. రామచంద్రమూర్తికి ఆశ్చర్యమైంది. ఆ కంఠం పురుషుడిదిలా లేదు. తప్పక స్త్రీయే అయివుండాలని నిర్ణయించుకున్నాడు.

మంచం కింద మంచినీళ్ల చెంబు కనపడుతోంది. మంచం మీద పడుకున్న వ్యక్తి అటు ఇటూ దొర్లి ఓపికగా పడుకుంటే రామచంద్రమూర్తి ఓ స్తంభం చాటున నిలబడి తొంగి చూశాడు ఆ కొద్ది వెలుతురులో. స్త్రీ!

మూర్తికి అసంబద్ధమైన ఆలోచనలు ముసురుకున్నాయి. ఎవరు? ఏమిటి? ఎందు కిక్కడ వున్నారు?

యాత్రికులకై ప్రత్యేకించబడ్డ ఆవరణంలో దోమతెర మంచం ఎలా వచ్చింది?

మూర్తికి తన ప్రశ్నలకు తానే విసుగుపడ్డాడు.

ముందు ఈ రాత్రి ఎలా గడపాలి?

బయట చలిగా ఉంది.

ఇక్కడ ఆఫీసరూ లేడు; చుట్టు బండలూ లేదు.

ప్రభుత్వం వాళ్లు ఏవేవో పేర్లు పెట్టి, ఏవేవో పనులు చూపి ఆఫీసర్లను నియమిస్తూనే వుంటారు.

ప్రజా సౌకర్యం అనే విషయంలో వాళ్లెలాంటి బాధ్యతా తీసుకోరు.

ఈ ఆఫీసరుగారు ఏమైనట్టు?

హాయిగా వెచ్చటి గదిలో, వెచ్చగా నిద్రిస్తూ వుంటాడు.

మూర్తి అక్కడే కూలబడ్డాడు.

ఆలయ శిఖరంలో పావురాళ్లు పాడుచుకుంటున్నాయి గావోలను గోల గోలగా ఉంది.

వేపచెట్టు మీదినుంచి గాలి వీచిన చప్పుడు. ధ్వజస్తంభాల మీది చిరు గంటలు గాలికి చేసే చప్పుడు.

కటిక నేలమీద పడుకున్నాడు మూర్తి.

వీపంతా చల్లగా చురుక్కుమంది.

సంచి లాక్కుని తలక్రింద పెట్టుకుని కళ్లు మూసుకున్నాడు.

కాని ఎంతసేపటికీ నిద్ర పట్టలేదు.

ముఖంమీద పడుతున్న వెలుతురూ, ఆ మంచం క్రిందినుంచే టిక్కు టిక్కుమని ధ్వనిచేస్తూ వాతావరణాన్ని వికృతపరుస్తున్న గడియారమూ అతడి ధ్యానాన్ని భంగపరుస్తున్నాయి. చలికి బిగుసుకుపోతున్నాడు. ఎంతకూ నిద్ర రావటం లేదు. పైన అంగుళం, పొడుగు దోమలు అతణ్ణి సందు లేకుండా ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి.

అతడికి నిజంగా ఏడుపు వచ్చింది.

రాత్రి దీర్ఘమై తనని మింగుతున్నట్లు తోచింది.

పది నిముషాలలోనే ఈ రాత్రి ఇంక తెల్లవారదు కాబోలు భగవంతుడా! అనుకున్నాడు.

లేచి కూచుని స్తంభానికి జేరగిలబడి దోమల్ని కసిదీరా చంపటానికి ప్రయత్నించాడు.

ఆ సమయంలో ఆ దోమతెర మంచంలో పడుకుని వున్న వ్యక్తిపైన అతని ఈర్ష్య చెప్పనలవి కాకుండా పెరిగిపోయింది. సరిగ్గా ఆ వెలుతురు ఆ వ్యక్తి ముఖంపైకి సోకేటట్లు పడుతున్నది. రామచంద్రమూర్తి చూశాడు. ఆట్టే యేళ్లు కూడా ఉండవు. రెప్ప వాల్చకుండా చూశాడు. అనమాన సౌందర్యవతిలా కన్పించింది. ఇంతలో కాలిమీద ఓ దోమ కరిచింది, అతడి ఆలోచనలకి భంగం కలిగిస్తూ.

అతడికి చెడ్డ విసుగు పుట్టింది.

బాధ కలిగింది.

చెవుల దగ్గర దోమల సంగీత సాధన భరించలేనంత మనోవికారం కలుగ చేస్తోంది.

ఎంత కసురుకున్నా చెవులో కుంయి మని ఒకటే రాగం.

వీలు చూసుకుని కరవటం.

రామచంద్రమూర్తి అక్కడినుండి లేచి చప్పుడు చెయ్యకుండా గేటు తీసుకుని ఆలయ ప్రాకారం దాటి బయటకు వచ్చాడు. చలి గడగడ లాడిస్తున్నది. బయట వెన్నెల కురుస్తోంది.

వెన్నెల్లో తల ఎత్తి ఆలయ శిఖరం వేపు చూశాడు.

ఎంత చిత్రమైన అనుభూతి!

ఏమి జీవితం! జీవితయానంలో ఇలాటి చిత్రవిచిత్రానుభూతులను సేకరిస్తూ పయనమై చివరికెక్కడో ఆగిపోతాడు మానవుడు. అదే మహాప్రస్థానం.

రామచంద్రమూర్తి ముగ్ధ ఉద్వేగ నేత్రాలు ఆలయ గోపుర శిఖరంకేసి చూసి చెమర్చాయి.

మానవుడు ఎంత గొప్పవాడు! అతడు ఛేదించని రహస్యం లేదు. ధైర్యంచేసి ఎదుర్కొని సమస్య లేదు.

మేఘాలలో కూచుని ఆ శిఖరానికి నగిషీలు ఎలా చెక్కాడో! మానవుడా! ఓ దివ్య శిల్పీ! నీకు జోహార్లు అనుకున్నాడు మూర్తి.

జేబిలోంచి తీసి సిగరెట్ ముట్టించుకున్నాడు.

తలమీద చెయ్యి పెట్టి చూసుకున్నాడు.

తడిసి చల్లగా ఉంది. అప్పుడే ముక్కులు బిగేసినట్. వణుకు పుడుతున్నా, అక్కడే కూచోవా లనిపించింది. కళ్లు మంటలు పుడుతున్నాయి.

అతడికి తెలుసు. ఇంక పది నిముషాలు తాను అక్కడే కూచుంటే మర్రోజున తప్పకుండా జ్వరం వస్తుందని. జాయినయిన రోజున్నే కాజువల్ లీవు అప్లయి చేయాలని.

సిగరెట్ విసరి పారేశాడు.

గుండెలు కొద్ది కొద్దిగా వెచ్చబడ్డాయి.

రామచంద్రమూర్తి ప్రొద్దున్నే బస్సులో పన్నెండు గంటల లోపున ఆ ఊరు చేరి స్కూల్లో జాయిన్ కావాలి. ఇదివరకు ఒక స్కూల్లో టీచరుగా పని చేస్తూండే వాడు. ఇప్పుడు ట్రాన్స్ఫర్ వచ్చింది. జాయినింగ్ టైమంతా ఇంటివద్దనే గడిపాడు. పీకమీద కొచ్చి రేపు జాయినయి తీరాలి అని తీర్మానించుకున్న తర్వాత బయల్దేరాడు. అడవిలోకి వెళ్లుతున్నాడు. అసలు అతడు ఈ పూరు రావాల్సిన పని లేదు. తనకు చిక్కవలసిన కారు చిక్కకపోతే ఈ పూరు చేరి ఆ పూరు చేరవచ్చు నని వచ్చాడు. కాని అతడి ఆశ పాపం అబద్ధమై కూచుంది. ఇక్కడినుంచి ఆ పూరుకు బస్సు వున్న మ్గాట వాస్తవమే అయినా, అది తెల్లవారుపొద్దుటి దాకా లేకపోయె. అతడు ఈ రాత్రికి ఇక్కడే వుండవలసి వచ్చె. ఇదంతా వో తమాషాగా జరిగింది.

—చిన్నతనంలో ఇటువంటి సంఘటనలు జరిగినప్పుడు రామచంద్రమూర్తి నిజంగా సంతోషించే వాడు.

చిన్నతనమంటే రామచంద్రమూర్తి నిజానికి ఇప్పుడు కూడా చిన్నవాడే. పాతికేళ్లు కూడా సరిగా నిండలేదు. అయినా జీవితంలో నిముగుదలని పెన వేసుకుని బ్రతుకుతున్న వాడు. పదహారు పదిహేడేళ్లప్పుడు ఎంత సరదాగా తిరిగే వాడు, ఎంత ఉత్సాహంతో వుండేవాడు.

ఇరవై, ఇరవై రెండేళ్లప్పుడు, భవిష్యత్తు మీద ఎంత ఆశ ఉండేది. ఆ రోజుల్లో ఇలాటి సంఘటన జరిగివుంటే హృదయ ఫలకంమీద రంగు రంగుల కుంచెలతో రంగులు రంగులుగా చిత్రించుకుని వుండేవాడు.

ఇప్పుడైనా ఈ రోజు రాత్రిని అతడు మరిచి పోలేదు. అయినా ఉత్సాహమూ, ఉద్రేకమూ నశించి ఏదో బ్రతుకుతున్నా నన్న భావాన్ని బలంగా పెంపొందించుకుంటున్న వాడు కాబట్టి, ఎప్పుడో ఒకప్పుడు విస్మృతిలో ఈ సంఘటనను మరచి పోతచ్చు.

ఆ రోజులలో అయితే ఈ సంఘటనకు ఎంతో ప్రాధాన్యం కలుగజేసి ఎంతో ప్రాముఖ్యం కట్టబెట్టి, ఎన్ని చిలవలు, పలవలు కలిపి విశాలతో చెప్పే వాడో!

ఈ ఆలయ గోపురాన్ని, వెన్నెల్లో మురిసి పోతున్న ఈ ప్రకృతిని విశాల ముందు కవిగా వర్ణించ గలిగే వాడు. గాయకుడిగా పాడగలిగే వాడు. కథకుడిగా చెప్పగలిగే వాడు. అవునా, అన్నట్లు ఆశ్చర్యపడిపోయి వినేది విశాల.

కాని ఇప్పుడు, ఈ సంఘటనకి, ఇటువంటి వాటికి అతడు ప్రాధాన్యం ఇవ్వలేదు.

విశాల దూరమైంది.

ఈ సువిశాల ప్రపంచం ఈమెతో తనని సుఖపడ నివ్వలేదు.

రామచంద్రమూర్తికి దగ్గు వచ్చింది.

ప్రొద్దున తప్పకుండా జ్వరం వస్తుందని అతడికి తెలిసిపోయింది. క్రొత్త వూళ్లో ఎలాగా అని అప్పుడే అతడికి దిగులైంది. లేచి ఆలయంలోకి వెళ్లాడు. తన మామూలు ప్రదేశాన్ని చేరుకున్నాడు.

సిగరెట్టు పెట్టె, అగ్గిపెట్టె తీసి సంచిలో వుంచుతుంటే, సంచిలో అతడి చేతి కేదో వెచ్చదనాన్ని కలుగజేసింది. అతడికి ప్రాణం లేచివచ్చి దాన్ని పైకి లాగాడు. ఉన్ని మఫ్లరు అతడికి ఎంతో సంతోషమైంది. ఇంకా వెతికి చూదా మనుకున్నాడు. ఇంకో దుప్పటి కూడా పైకి తీశాడు. అతడి ప్రక్క చుట్టూ సామానులు, ప్రొద్దుటే ఓ కుర్రాడు ఆ వూరికి వచ్చి వప్ప జెప్పి పోతానన్నాడు. తాను ఆ రాత్రికే ఆ వూరు చేరితే ఆ రాత్రికి ఏ టీచరింట్లోనో గడపవచ్చు నన్నది అతడి సదాశయంగా ఉండినది. కాని కథ అడ్డం తిరిగింది. ఈ రాత్రికి ఈ వూళ్లోనే వుండవలసి వచ్చింది.

'నిజంగా ఆడవాళ్లు ఎంత తెలివైన వాళ్ళని అనుకున్నాడు మూర్తి. ఆ సమయంలో శశిని అభినందించకుండా వుండలేక పోయినాడు. శశిమీద అభిమానం లాంటి ప్రేమో, ప్రేమలాటి ఆ మానమో అతడు పొందాడు. ఇంతలోనే మళ్లీ అతడు ఉదాసీను డైనాడు.

'అతని కిప్పుడే జ్ఞాపకం వచ్చింది.

శశి వాకిట్లో నిలుచుని "సంచిలో వుంచుతున్నాను మఫ్లరు. చలిలో చుట్టబెట్టుకోండి. లేకపోతే కళ్లు ఎర్రబడతాయి. అసలే మీ వొళ్లు మంచిది కాదు" అని చెప్పినప్పుడు అతడు చిన్న పిల్లవాడికి చెప్పినట్లు చెపుతోంది అనిపించి లోలోపల విసుక్కున్నాడు కూడ.

అప్పుడు శశి కళ్లలోని స్పష్టమైన నిర్లిప్తత, నీడల వలె కదులాడే విచారమూ తాను చూడగలిగాడు కూడ.

శశి అంతటితో వూరుకోలేదు.

'వెళ్లగానే ఉత్తరం వ్రాయండేం. మరచిపోకండేం' అంది. అటువంటి మర్యాదకోసం మాట్లాడే మాటలంటే మూర్తికి మహా చెడ్డ చిరాకు.

"అప్పుడే మీ కళ్లు ఎర్రబడ్డా యేం, పోనీ సోమవారం వెళ్లి చేరకూడదా" అని అసందర్భంగా అడిగింది.

అలా వుండవచ్చునా గాలివలె దూసుకవచ్చి చొక్కాలోకి చెయ్యి పోనిచ్చి వొళ్లు చూసి సంతృప్తిపడి వెనక్కు తగ్గింది.

మూర్తికి ఏడవాలో, నవ్వాలో అర్థం కాలేదు అప్పుడు.

శశి తనతో కలిసి జీవించడానికి వచ్చి ఏడాది దాటుతున్నా మూర్తికి శశి పూర్తిగా అర్థం కాలేదు. అర్థం చేసుకుందామని అతడు ప్రయత్నించనూ లేదు.

ఆలయంలో దుప్పటి ముసుగు పెట్టుకుని, మఫ్లరు తలకు చుట్టుకుని పడుకున్నాడు మూర్తి. వీపు క్రింద బండల చల్లదనం ఇంకా అతణ్ని బాధిస్తూనే వుంది. పైపెచ్చు దోమల గోల ఒకటి. టిక్కు టిక్కు మని ఎడతెగని గడియారవు చప్పుడు.

ఈ రాత్రి తనని బాధించటానికని పొడు గెదుగుతున్నదా అనుకున్నా డతడు.

దోమ తెర మంచం మీది అమ్మాయి సన్నగా ఆవులించి చిటికె వేసింది.


మూర్తి నిద్రపోవటానికని శతథా ప్రయత్నించాడు. ఏవేవో ఆలోచనలు తెచ్చుకున్నాడు. కళ్లు బరువెక్కి మంటలు పుడుతున్నాయే కాని నిద్ర వచ్చే సూచనలు ఎంతమాత్రమూ కన్పించటం లేదు.

అతడు గడిచిన జీవితాన్ని గాథలా చదువుకున్నాడు. ఆ చలిలో, ఆ ఆలయంలో, ఆ వెన్నెలలో, ఆ రాత్రి. అదే చిత్రం జీవితంలో.

చిన్నతనమంతా సరదాగానే గడిచిపోయింది. తండ్రి లేకపోయినా, తానై అన్నిటికీ పెంచింది తల్లి. అన్ని రకాల బాధలు అనుభవించినందువల్ల జీవితంలోని కఠోర సత్యాలను చిన్నవాడే అవగాహన చేసుకోగలిగాడు.

నాణెము, మన్నిక, చౌకకు

ఎల్లప్పుడు ఈ ట్రేడ్‌మార్కునే చూచుకోవలెను




శ్రేష్ఠమైన నూలుతో తయారుచేయబడ్డవి.

లుంగీలు, చేతిరుమాళ్లు,

ఇంకను మీ అవసరములకూ, అభిరుచికీ

తగినట్లు అనేక రకాలలో దొరకును.

ఆంధ్రదేశ మంతటా దొరకును.

రేట్లకు, వ్యాపార షరతులకు వ్రాయండి.

అమిన్ అండ్ కో,

233, అంగప్పనాయక్ వీధి, మద్రాసు—1.

H.O. 58, Lower Chitpore Road, CALCUTTA.

లోకులకు వినయ విధేయతలు చూపించేవాడు.

లోకానికి సత్ప్రవర్తన నిరూపించాడు.

అందరికీ మంచివాడు అనిపించుకున్నాడు.

అటువంటిది ఇంటర్మీడియట్ ఫస్టు క్లాసులో ప్యాసైనానని తెలుసుకుని బిక్క మొగం వేసుకుని ఇంటికి వచ్చాడు. తల్లి తన నెలా చదివించగలదు?

అవాళ ఆనందానికి బదులు నూరు పాళ్లూ విచారాన్నే అనుభవించాడు. తల్లి సంతోషంగానే వుండింది. స్నేహితులు చాలామంది వచ్చి అభినందించిపోయేరు.

"దిగు లెందుకురా పిచ్చి నాయనా, నేనున్నానుగా" అన్నది తల్లి. "ఆయన లేకపోయె, ఎంత సంతోషించును" అని కన్నీళ్లు వొత్తుకుంది.

ఆ సాయంకాలం వా ళ్లింటి కెళ్లారు తాము. ఎంత దివ్యంగా ఉంది ఆ ఇల్లు. తాను బయట చేతులు కట్టుకుని నిలబడ్డాడు: ఆ ప్రక్క గదిలో ఆవుపడుతున్న నవ్వులూ, పరాచికా లాడుతున్న ఆడ పిల్ల లందరూ అతడికి తెలుసు. వాళ్లు ఇవాళ ఎంతైనా ఆనందిస్తారు. వాళ్లూ పరీక్షలు ప్యాసై వుంటారు.

విశాల పలకరించింది మర్యాదగా.

ఎంత బావుంది అనుకున్నాడు.

'ఫస్టు క్లాసు వచ్చిందా, అదృష్టం' అంది.

తోటి వాళ్లూ అంతే అన్నారు.

సిగ్గుతో భూమిలోకి కూరుకునిపోయినాడు. తల వంచుకున్నాడు.

విశాల స్నిగ్ధంగా నవ్వింది.

"బి. యస్. సి. లో చేరతాను" అన్నది. "నువ్వు కూడా చేరు" అన్నది.

"అయ్యో నా మతి మండా. గదిలోకి వచ్చి కూర్చో మూర్తీ. ఎందు కొచ్చా వసలు" అంది.

మూర్తి కెంతో దిగులైంది. అంతమంది నేరస్థురాళ్లూ "ఏం చెపుతాడా?" అని ఉత్సుకతో చూశారు. మూర్తి కుంచించుకుని పోయినాడు.

ఇంతలో విశాల తండ్రి వెంట తన తల్లి వచ్చింది. మూర్తి లేచి నమస్కారం చేశా డాయనకు.

ఆయన మరేమీ అనలేదు. "అప్లికేషను తెప్పించి పూర్తిచేసి నీ ఇష్ట మొచ్చిన దాంట్లో చేరు నాయనా" అన్నారు.

ఒక్కసారిగా ఆయన కాళ్లు కళ్ల కద్దుకుందా మనుకున్నాడు మూర్తి. ఆతడి కళ్లు తుడుచుకున్నాడు ఎవరికీ కనపడకుండా. విశాల చూసింది.

ఆ రాత్రి అతడు భూలోకంలోని దేవుళ్లను గురించే ఆలోచిస్తూ నిద్రపోయాడు.

బి. ఎస్. సి. కంటే బి. ఏ. తక్కువ ఖర్చుతో అవుతుంది. కాబట్టి బి. ఏ. లో చేరతానమ్మా అన్నాడు.

"నాయనా నీ ఇష్టంరా" అన్నది అమ్మ.

మళ్లీ రెండోసారి విశాల వాళ్లింటి కెళ్లాడు.

విశాల మరీ బావుంది.

తనని చూసి సంతోషంతో దగ్గరకు వస్తూ కొంచెం విచారం వొలకబోస్తూ "నాకు బి. ఎస్. సి. సీటు రాలేదు. బి. ఏ. లో చేరుతాను" అన్నది.

నువ్వు బి. ఎస్. సి. లో చేరు. తప్పకుండా సీటు వస్తుంది.

అప్పుడు తాను

"అప్లికేషన్ పూర్తిచేసి ఇచ్చి వచ్చాను. నేనూ బి.ఏ. లో చేరుతాను."

ఆ అమ్మాయి ముఖం ఎంతలా వికసించింది.

సాయంకాలపు బంగారు ఎండకు మిలమిలా మెరిసిపోతూ సిగ్గుతో తలవంచుకున్న సూర్యముఖి పుష్పంలా వికసించింది ఆమె ముగ్ధ మోహన సుందర వదన బింబం. మూర్తి వెలిదామరల పైననూ, కలువ పూల పైననూ, నీలి మేఘాల అంచుల పైనను తేలిపోయాడు.

చందమామను అందుకోబోయాడు.

ఆ రోజునుంచి, ఆ క్షణంనుంచి అతడు మారిపోయినాడు.

రోజు గడిచి రోజు నడుస్తుంటే ఎన్ని కోర్కెలు పెంచుకున్నాడు? ఎంత మారిపోయినాడు?

ఒకేసారి బయలుదేరి కాలేజీకి వెళ్లేవాళ్లు.

ఒకే పుస్తకాలు చదువుకునే వాళ్లు.

ఒకే మాటమీద నిలబడే వాళ్లు.

అతడికి తెలియదు. ఆమెకు తెలియదు.

దీని పర్యవసానం జీవిత గతులను మార్చి నిర్లిప్తులనుగా తమను చేస్తుందని.

పరీక్ష రోజులలో పొద్దుపోయేదాకా చదువుకునేప్పుడు విచ్చుకున్న కలువ పూవులా ఉన్న విశాల మేలి వసనాలలోంచి ఎసెన్సుల పరిమళం ఆతణ్ణి చుట్టు ముట్టి గిలిగింతలు పెట్టేది.

ఎన్నిమార్లు అనుకున్నాడు? ఎంత బావుంటుంది! అని. రోజు కెన్నిమార్లు అనుకున్నాడు.

వెన్నెల కిటికీ చువ్వల్లోంచి కూచున్న కుర్చీల మీదకు పాకుతుంటే కిటికీ పక్కని నైట్ క్వీన్ పువ్వుల పరిమళం చుట్టు ముట్టుకుంటుంటే షేక్స్పియర్ డ్రామాలో లేడీ మేక్‌బెత్, మేక్‌బెత్‌కి వ్రాసిన ఉత్తరం తా మిద్దరూ కలిసి చదువుకో లేదూ?! పారిజాతాపహరణంలోని పద్యాలు చదువుకో లేదూ!

విశాలా తానూ దొంగతనంగా రెండో ఆట సినిమాలకు వెళ్లలేదూ.

ఎన్ని కోర్కెలను పెంచుకున్నాడు. ఎంత ప్రలోభంలో పడిపోయాడు మానవుడు.

ఒకనాడు. ఆనాడు ఎప్పుడో రాక వుంటుందా?

అప్పుడు తెలిసింది. ఈ మధ్యా బంధం పుటుక్కుమని తెగిపోయింది. కళ్లలో నీళ్లు.

ఒకరి కొకరు ఏమీ కారా?

ఏమీ కారు.

అవును. ఏమీ లేదు. అంతా మిథ్య. నాటకం.

ఎంత నంగనాచిలా వొప్పేసుకుంది పెళ్లికి.

ఇంక కులుకుతుంది కాబోలు.

దేవమ్మ!

నందివర్ధనం పువ్వులవంటి తెల్లటి సిల్కు బట్టలలో విశాల ఎవ రింటికి వెడుతుందో. ఎవరో అదృష్టవంతుడు.

అమ్మో! అమ్మో!

అతడి గుండెల్లో చెప్పలేని వేదన.

చక్కా పెళ్లి జరిగింది. చక్కగా విశాల మొగుడి వెంట వెళ్లింది. పెళ్లిలోని వేడుకలన్నీ అమ్మ వొక్కొక్కటే చెప్పి చెప్పి, తలచి తలచి, మురిసి మురిసి, ఉబ్బిపోతుంటే ఎంత తిక్క రేగింది మూర్తికి. అమ్మమీద ఎంత విసుక్కున్నాడు.

పరీక్ష ప్యాసైనాడు. క్లాసు రాలేదు.

బి. ఇడి. చదవక తప్పలేదు.

అమ్మ పోరు ఎక్కువైంది.

"నాకు పెళ్లి వద్దు" పొమ్మన్నాడు.

అమ్మ కళ్ల నీళ్లు పెట్టుకుని.

"నీ కోసం నేను బ్రతికివుంటే, నే చెప్పిన మాట నువ్వు వినవా? నే నప్పుడే చచ్చిపోతే ఎంత బావుండిపోను"

"అమ్మా!!"

అతడు పెద్దగా ఏడ్చాడు.

ఆతణ్ణి పాపడిని లా అమ్మ వొళ్లోకి తీసుకుంది.

శశిని తెచ్చి పెళ్లి చేసింది.

శశిని అతడు ఏనాడూ ప్రేమించి యుండలేదు.

ప్రేమించలేడు.

ప్రేమించలేక పోతున్నాడు.

రామచంద్రమూర్తి ఇన్ని ఆలోచనలతో కంటి మీదికి కూర్కు తెచ్చుకున్నాడు. అలానే నిద్రపోయినాడు.

ఆలయ శిఖరంమీద పావురాళ్లు గోల గోలగా అరుస్తున్నాయి. ఆహారాన్ని వెతుక్కునేందుకు బయలుదేరుతున్నాయిలా వున్నాయి. ఒక్కొక్కళ్లే లేచి వెళ్లిపోయారు.

బాగా తెల్లవారింది.

రామచంద్రమూర్తిని ఎవరో కుదిపి లేపారు.

"ఇంక లేవయ్యా సూర్యుడు నడినెత్తిమీద కొస్తుంటే"

రామచంద్రమూర్తికి మగతలోనే ఎవరిదో తళుక్కున నవ్విన కంఠం వినిపించింది. వెంటనే లేచి కూచుని నవ్వు వినిపించిన వేపు చూశాడు. ఓ సుందరాంగి అక్కడ నిల్చుని నవ్వేసింది. జవానులా వుంది ఆ లేపిన మనిషి. ఆతడి మాటలకు అమ్మగారికి నవ్వొచ్చింది. మఫ్లరు విప్పి సంచిలో పెట్టుకున్నాడు. దుప్పటి మడుచుకున్నాడు. అంతే. గడపలో నిలుచుని వున్న సుందరాంగి ఒక్కొక్క అడుగే ముందు కేసింది. మూర్తి తాను పడుకున్న ప్రాంగణాన్ని పరకాయించి చూశాడు. దోమ తెర మంచం లేదు అక్కడ.

అతడు లేచి నిల్చున్నాడు.

"మూర్తీ . . ." వెనకాల పూడుకొని పోయినట్లున్న గొంతు. వెనక్కు తిరిగి చూశాడు.

ఆమె అక్కడే నేరస్థురాలిలా నిలబడి ఉంది.

తల యెత్తి చూసి "నేను రామం" అన్నాడి.

అతడికి ఆ ఆలయ గోపురమూ, తానూ, ముందున్న వేపచెట్టూ, ఆమే అంతా గిరగిరా తిరుగుతున్న ట్లనిపించింది. గొంతు పిండుకు రాగా 'విశాలా' అన్నాడు.

విశాల లోపలికి రమ్మంది.

(మిగతా 64 వ పేజీలో)

దోం! పైకి ఎంతైనా నెమ్మదిగా ప్రియంగా మాట్లాడుతుంది, నవ్వుతుంది!"

"నీ కసలు పడనట్లుందే వీళ్లంటే! ఆ విధంగా కక్షలు పెంచుకొని ప్రయోజన మేమిటి? అవతలి వాళ్లు ఎటువంటి వాళ్లయినా మనం వాళ్లతో సఖ్యతగా మెలగటం నేర్చుకోవాలి. మనకు వాళ్లు మంచివాళ్లు కారని తెలిస్తే మన జాగ్రత్తలో మనం వుండాలి, అంతేకాని ద్వేషం పెంచుకొని, ముఖం త్రిప్పుకొని, వీళ్లు శత్రువులు, వీళ్లు మిత్రులు అని ప్రవర్తించటంలో సుఖం లేదు.

"నువ్వు చెప్పినట్లే వుంటున్నాను నేను! నాకేమీ కక్షలు అక్కర్లేదు. కాని నోరు విప్పితే దురుసుగా మీద పడవచ్చే వాళ్లతో, వెక్కిరించే వాళ్లతో మాట లేమిటి?" అని చేతి రుమాలుతో కళ్లు తుడుచుకొన్నది రమణి.

"ఏమైంది? అంతగా బాధ పడడానికి కారణం?" అని ప్రశ్నించాడు సుందరరావు అర్థం కాక.

"ఆ పార్వతికి ఎప్పుడూ నన్ను, శారదాంబగారిని ఏవో అనటమే పని. హాస్టలులో ఒక పెద్ద జట్టు తయారు చేసింది. ప్రతి విషయానికి "ఇది బాగు లేదు. అది బాగులేదు, శారదాంబ పక్షపాతి" అని వ్యతిరేక ప్రచారం చేస్తుంది వార్డన్‌ను గురించి."

"రాజకీయాలు బాగానే వున్నాయే, పదిహేను మంది వుండే ఆడవాళ్ల హాస్టల్లో కూడా!" అన్నాడు సుందరరావు.

విషయం మారుస్తూ రమణి ప్రశ్నించింది! "నీకు పాటలంటే అంత ఇష్టమా, బావా?"

"ఏమిటి నీ ప్రశ్న? పాటలు ఇష్టం లేని దెవ్వరికి? నీకు మాత్రం పాటలు వినడం, సినిమాలు చూడటం ఇష్టం లేదూ?"

"అది కాదు! పాటలకోసం విమలను ఎప్పుడూ ప్రాధేయపడుతూ వుంటావట. ఆమె పాడకపోతే, విద్యార్థుల్లో పాడేవా ళ్లెవరూ లేరా? శారదాంబ అంటుంది, "ఆ విమలతో మీ బావగా రంత పరిచయంగా వుండటం ఏమంత మంచి పని కాదు" అని.

సుందరరావుకు కోపం వచ్చింది. కాని కోపంగా ఏమీ అన దలుచుకో లేదు. కళాశాలకు వచ్చి అయిదారు మాసాలు కాలేదు. చిన్న పిల్లగా వుండిన రమణి ఎంతలో లోకానుభవం గల స్త్రీగా మారిపోయింది అనుకొన్నాడు. కాని ఆ పిల్ల లోకానుభవ మేమిటి, నిజంగా? అన్న వూహ వచ్చి నవ్వాడు. ఇది రమణితో సరదాయైన కొత్త విషయంగా తోచింది.

"నీ కంతా తమాషా కాని, నిజంగా, బావా! ఏమిటా అమ్మాయితో?" అన్నది మందలిస్తూ రమణి.

మళ్లీ నవ్వి, ఆగి, "నేను ఆ అమ్మాయిని పెళ్లి చేసుకొనే భయం ఏమీ లేదులే!" అన్నాడు.

రమణి ముఖంలో గులాబీలు విరిశాయి. ఆమె సిగ్గు చూచి నవ్వుకున్నాడు సుందరరావు. "పెళ్లి" అనే పదం వినబడగానే సిగ్గేమిటో ఆడ పిల్లలకు! అని వింతపడ్డాడు. (సశేషం)

# ప్రేమించిన మానవుడు

[16 వ పేజీ తరువాయి]

ఆ స్వత్రంలోనే ఆమె వెనుక ఇంట్లోకి వెళ్లాడు.

సోఫామీద కూచున్నాడు. ఇందాక తట్టి లేపిన జవాను ముఖం పాలిపోయింది. విశాల వాడితో ఏదో చెప్పింది. వాడు వెళ్లిపొయ్యాడు.

"ఎంతలా చిక్కిపోయావు రామం" అంది విశాల.

మూర్తి మాటాడలేదు.

"శశి బావుందా" ఈసారి అతడు నోరెత్తలేదు.

"ఏమి టీ నిష్ఠూరం. పాపిష్ఠిదాన్ని. చావలేక పోయినాను. రాత్రంతా ఆ బండమీద, ఆ దోమలతో అలానే పడుకున్నావా? " విశాల గొంతు పూడుకపోయింది. ఇక మాటాడితే ఏడుపుకి సందు దొరికినట్లు అని తెలుసుకుంది. లోపలికి వెళ్లి స్టౌమీద డికాషన్ దించి వచ్చింది పాలు వుంచి. మూర్తి ఆ ఇంటికేసి, రంగు రంగుల తెరలకేసి, ఫర్నిచరుకేసి చూస్తూ కూచున్నాడు. విశాల అడిగింది.

"ఈ కొంప బావుందా? అడవిలా ఉంది బాబూ. ఆ రోడ్డు బాగుచేసి యాత్రా సౌకర్యం కల్పించటం కాదు కాని మా ప్రాణాని కొచ్చింది. ఆయన్ని ఇక్కడ దేవస్థానం ఆఫీసరుగా వేశారు. ఎప్పుడూ క్యాంపులే. చచ్చిపోతున్నాను. ఇంకా నయం. వచ్చి పొయ్యే వాళ్లతో సందడి. కొస్త కాలక్షేపం." లోపలికి వెళ్లి పాలు దించి పళ్లపొడి, నీళ్లూ తెచ్చింది.

రామచంద్రమూర్తికి వింతగా వుంది. ఇలా విశాలను తాను కలుసుకోగలుగుతాడని కలలో గూడా వూహించలేదు. అతడిలో ప్రత్యణువూ, ఆమెను చూడాలని ఇదివరలో వాంఛిస్తున్నా ఇప్పుడు ఆమెను చూడగానే ఒక్కసారిగా అతడిని నిర్లిప్తత ఆవహించింది. యాంత్రికంగా ముఖం కడుక్కున్నాడు. ఆమె తువాలు తెచ్చి ఇచ్చింది. కాఫీ తెచ్చింది. ఇవన్నీ విశాల చేతుల్లోంచి అందుకుంటుంటే అతడి మనసు గిజగిజలాడిపోయింది.

కాఫీ తాగి గోడమీద గడియారం కేసి చూశాడు తను. ఆరున్నరయింది. విశాల ఎదురుగా కుర్చీలో కూర్చుని కాఫీ త్రాగుతుంటే అతడు ఒక్కసారిగా లేచి నిల్చుని "వెళ్లొస్తాను" అన్నాడు.

విశాల ముఖం పాలిపోయింది.

ఎక్కడా ఒక్క నెత్తురు చుక్క కూడా లేదు.

"ఏమిటి?" అంది తమాయించుకుని.

"స్కూలు కెళ్లి జాయినవాలి" ముక్తసరిగా సమాధాన మిచ్చాడు.

"పరిహాసంగా మాట్లాడకు రామం. రేపు వెళ్ల వచ్చులే" అంది లేని స్నిగ్ధతను తెచ్చిపెట్టుకుంటూ.

"పరిహాసం కాదు విశాలా! పన్నెండు గంటల లోపల జాయినవాలి."

"ఈ ఒక్క రోజు వుండు రామం. నువ్వు కనపడితే చూడాలని, నీతో ఎన్నెన్నో చెప్పుకోవాలని అనుకుంటున్నాను. పాత సంగతులు గుర్తు చేసుకుని, ఆ రోజులను తలుచుకుని అయినా సంతోషిద్దామని. నీ కెన్నో చెప్పాలి రామం. లేకపోతే నేను ఇలానే వ్యధిత చిత్తంతో కాలం గడపాల్సి వస్తుంది."

రామచంద్రమూర్తికి విశాల ఇలా మాట్లాడటం చాలా కొత్తగా ఉంది. ఇదివరలో అత డెరుగడు—విశాల నోటవెంట ఇలాటి మాటలు వస్తాయనుకొని.

"వీల్లేదు విశాలా!" అన్నాడు దిగులుగా ముఖం పెట్టి.

విశాల దిగాలుపడిపోయింది.

"నా అదృష్టం రామం. రాత్రి నిన్ను గుర్తించగలిగివుంటే, నా మనస్సు విప్పి చెప్పుకుని కొంతవరకైనా వూరట పొందగలిగేదాన్ని. భగవంతుడు మనలను నొకరి నొకరం చూసుకునేట్లు చేసికూడా, మాట్లాడుకునే వ్యవధానం కల్పించలేదు. వేదన పడితే ఏం లాభం?"

రామచంద్రమూర్తి మరీ ఆశ్చర్యపడ్డాడు. విశాల తనతో ఏమని చెప్పుకుంటుంది? ఆరాట మేమిటి? వూరట ఏమిటి?

చివరిసారి అడిగింది విశాల గోముగా.

"పోనీ మధ్యాహ్నంనుంచి వెళుదువుగాలే. కాదనకు. లే, స్నానానికి నీళ్లు తోడుతాను."

విశాల లేచి నిల్చుంది.

"లేదు విశాలా! ఈ పూట స్కూలుకు చేరి తీరాలి. తప్పదు." అన్నాడు.

విశాల ఉద్వేగాన్ని చూపుతూ నొసటిమీద కొట్టుకుని,

"సరే వెళ్లు. నిన్ను నేను గుర్తించలేనందుకు నాకు మంచి శిక్షే విధించాడు భగవంతుడు అనుకుంటాను" అన్నది.

"ఇందులో నీ తప్పు ఏమిటి విశాలా?"

"ఏమీ లేదులే. సరే వెళ్లు. ఒక్క పూట ఉండి నా చేతి భోజనం చెయ్యటం కూడా నీ కిష్టం లేదని తెలుస్తూనే వుంది. నిన్ను గుర్తించానని పొరపడ్డాను. కాని నిన్ను ఆనాడే నేను గుర్తించి వుండవలసింది."

"లేదు విశాలా!" అన్నా డతను ఏదో అనబోయి. అక్కడినుండి కదిలాడు. జవాను ఇంతలో పెద్ద టిఫిన్ పొట్లమొకటి తెచ్చాడు. రామచంద్రమూర్తి చేతిలోని సంచీ లాక్కుని దాంట్లో ఆ టిఫిను పొట్లం ఉంచి ఆలయం ఆవరణ దాటేవరకూ వెనుక నడిచింది విశాల. విశాల చేతిలోంచి ఆ సంచీ అందుకుంటూ, ఇక వెళ్లివస్తానని చెబుతూ విశాల ముఖంలోకి చూశాడు మూర్తి.

ఆమె కళ్లు రెండూ నీటితో బరువెక్కి వున్నాయి. "ఎందుకు విశాలా!" అన్నా డతడు. కాని ఎందుకో అతడికి తెలుసు. అతడు కదిలిపోయినాడు. ఊరు చేరినదాకా అతడు విశాలనూ, శశినీ పక్క పక్కన నిలబెట్టి ఆలోచించుకున్నాడు ఏమిటో.

**Printed and Published by A. Ramaswami Iyer, B.A., B.L., at the "Indian Express" Press Express Estates, Mount Road, Madras. Editor: Narla Venkateswar Rao.**